క్లుప్తంగా

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి
ఎంపీ కేశినేని నాని

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీని అభ్యర్థించారు. దేశ ప్రజలు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తిగా ఎన్టీఆర్ సామాన్య కుటుంబం నుంచి ఎదిగారని తెలిపారు. ప్రఖ్యాత సినీ నటుడుగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తికి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వడమే నిజమైన నివాళి అన్నారు.

37వ డివిజన్ కాపునాడు నూతన కార్యవర్గం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని 37వ డివిజన్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు తెలిపారు. ఈ సందర్భంగా 37వ డివిజన్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం విస్తృత సమావేశాన్ని శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడిగా బావశెట్టి వెంకటరమేష్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రాజులను ఎన్నుకున్నారు. అంజిబాబు మాట్లాడుతూ కాపులంతా ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపా రాము, రాష్ట్ర నాయకులు తణుకు శంకర్ నాయుడు, కర్రి గౌరీ, పలిశెట్టి కనకారావు, ఆలమూరు సాంబశివరావు, సురాబత్తుల రమేష్, సురాభత్తుల రాంబాబు ఈజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14 మద్యం బాటిల్స్ స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, 14 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజా సెంటర్‌లో ఓ యువకుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్ఐ రాజా నరేంద్ర పంజాసెంటర్‌లో మద్యం విక్రయిస్తున్న గోర్ల రామకృష్ణను అదుపులోకి తీసుకుని 14 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ హనుమాన్ నృత్య కళా నిలయంకు చెందిన పలువురు చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు ప్రసాదాలు అందచేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అకాడమీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని కళాశాలలోని సాంస్కృతిక వేదికపై గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆపాత మధురలో పేరుతో సాగిన కార్యక్రమంలో ఘంటసాల, బాలుతోపాటు సుశీల, ఎస్.జానకి, చిత్ర ఆలపించిన గీతాలను రమణ శీలం, నందితా జ్యోతి, గాగర్లపూడి నాగార్జున ఆలపించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ ఎస్.లలిత్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు తాతినేని శ్రీహరిరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

11 నుంచి రథయాత్ర

మధురానగర్: శ్రీ శివజ్ఞాన పీఠంలో ఐదు అడుగుల శివసూర్యుడు విగ్రహ ప్రతిష్ఠ, కళ్యాణ నవగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఇంటింటికీ సూర్యదర్శనం, ప్రతి ఇంటా ఆరోగ్యం కార్యక్రమం ద్వారా 58 రోజుల పాటు రథయాత్ర నిర్వహించనున్నట్లు పీఠాధిపతి శివాచార్య స్వామి తెలిపారు. ఏలూరు రోడ్డులోని శ్రీ శివజ్ఞాన పీఠంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు 58 రోజుల పాట నగరంలో రథయాత్ర ద్వారా తొమ్మిది రకాల నవగ్రహ వ్రతములు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యాపార వర్గాలకు అండగా ప్రభుత్వం

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



పాతబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు



ఇన్‌చార్జి షేక్‌ఆసిఫ్‌ను సత్కరిస్తున్న డివిజన్ పార్టీ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యాపార వర్గాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అండగా ఉందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. నియోజకవర్గంలోని గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ఆధ్వర్యంలో ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి శుక్రవారం డివిజన్‌లోని శివాలయం వీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని వ్యాపార వర్గాలను కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించి రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయాలని కోరారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ సెంటర్ నుంచి ప్రారంభమైన పర్యటన శివాలయం వీధిలోని ఐరన్ సెంటర్, మొయిన్‌బజార్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అదేవిధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రధానంగా గత చంద్రబాబు ప్రభుత్వం నగరంలో కూల్చిన పలు ఆలయాలను తమ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పునర్నిర్మాణం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనేక దశాబ్దాల క్రితం వేసిన పాతబస్తీలోని మొయిన్‌బజార్, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీసీ రోడ్ల నిర్మాణం చేశామన్నారు. శివాలయంవీధిలో విద్యుత్ వైర్లు సమస్య అనేక దశాబ్దాలుగా కొనసాగుతోందన్నారు. దానిని నివారించి కోట్లాది రూపాయాలతో ప్రత్యేక విద్యుత్ లైన్లు వేసిన విషయాన్ని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యాపార వర్గాలకు అండగా ఉంటుందన్నారు. ఏ సమస్య వచ్చినా తక్షణం దాని పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జమల పూర్ణమ్మ, కార్పొరేటర్ బుల్లా విజయకుమార్, జిల్లా అధికార ప్రతినిధి కొణిజేటి రమేష్, నాయకులు మైలవరపు దుర్గారావు, అత్తులూరి పెదబాబు, విశ్వనాథ రవి, గ్రంధి రమేష్, హాయత్, టి.శేఖరరెడ్డి, కొరగంజి భాను, కిషోర్ జిలానీ, రాఘవ, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ముస్లింలకు పెద్దపీట

వించిపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం దక్కిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ తెలిపారు. వించిపేట, నైజాంగేటుసెంటర్‌లోని మహమ్మదీయ మసీదును శుక్రవారం సందర్శించి మత పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు ముస్లిం మైనార్టీలను చిన్నచూపుతో చూసేవారన్నారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్ని రంగాల్లో వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి గౌరవించారన్నారు. 2014లో చంద్రబాబు ప్రార్థనా మందిరాలను కూల్చినప్పుడు ఆయన కూటమిలోనే ఉన్న పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను ముస్లింలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వారిని ఓడించేందుకు ముస్లింలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గడపలో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురం ఊర్మిళానగర్‌లోని 43 వ డివిజన్‌లో కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. డివిజన్‌కు వచ్చిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. డివిజన్‌లో ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డివిజన్‌లో రూ. 25 కోట్ల మేర అభివృద్ధి జరిగిందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, పార్కులు, విద్యుద్దీకరణ, డ్రైనేజీ సమస్యల పరిష్కారం చేశామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు అందాయని ప్రతి గడపలో చెబుతున్నారన్నారు. ఇంటింటికి వెళ్లినపుడు ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, మహాదేవ అప్పాజీ, రాజేష్, ఎలకల చలపతిరావు, ఆంజనేయ రెడ్డి, ఇర్ఫాన్, కార్పొరేషన్ చైర్మన్స్, డైరెక్టర్స్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బట్టి పార్టీ సంధ్యారాణి, కృష్ణారెడ్డి, శివ, మధు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ఇంటి ముంగిటికే వైద్య సేవలు అందిస్తున్నారని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా తెలిపారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ 194 సచివాలయం పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఆమె పాల్గొన్నారు. వైద్యులు ఎం.శ్రీనివాసరాజు, జి.సింధు ప్రియ, జె.చందన కుమార స్వామి, జి.శ్రీనివాసులు తమ సిబ్బందితో అందిస్తున్న వైద్య సేవలను ఆమె పర్యవేక్షించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. రెహమతున్నీసా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి ఆయా ప్రాంత ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా వైద్యం చేస్తున్నారని చెప్పారు. ఆయా ఆరోగ్య కేంద్రాలలో ఏడు రకాల రక్తపరీక్షలుకూడా ఉచితంగా చేసి రోగ నిర్ధారణ చేసి మందులుకూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, సచివాలయం అడ్మిన్ లక్ష్మణ్, హెల్త్ సెక్రటరీ లూసీరాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమంగా వాడుకుంటే చర్యలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యుత్‌ను అక్రమంగా వినియోగించుకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ హెచ్చరించారు. విజయవాడ టౌన్ డివిజన్ రామరాజ్యనగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ కార్యనిర్వాహక ఇంజినీర్ జి.కమల కుమారి పర్యవేక్షణలో 92 మంది సిబ్బంది 46 బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, చెరువు సెంటర్, లేబర్‌కాలనీ, జోజినగర్, ఏకలవ్య నగర్, ఊర్మిళానగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, లలితానగర్, శంకర మఠం, కామకోటినగర్, ఇస్లాంపేట, వంగవీటి మోహనరంగా జంక్షన్, కబేళా ప్రాంతాల్లోగల విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారు. ఇందులో ఒక కేటగిరి నుంచి వేరొక కేటగిరికి వాడకోవడం, మంజూరయిన లోడ్ కంటే అధిక లోడ్ వాడుకోవడాన్ని గుర్తించి మొత్తం 153 కేసులు నమోదు చేసి వారికి రూ.4.42 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు, ఆపరేషన్ డీఇఇ టీ రవిచంద్ర, ఆపరేషన్ ఏఇఇ ఐ రామలింగేశ్వరరావు, విజయవాడ టౌన్ డివిజన్‌లోని పలువురు డిఇఇలు, ఏఇలు, జెఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన గుణదల కొండ





గురువులను ఆశీర్వదిస్తున్న విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు, సమిష్టి దివ్యబలిపూజ నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ లూయిస్‌రాజు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- తిరునాళ్ల సందడి
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహణ

గుణదల(విజయవాడ తూర్పు): మేరీమాత ఉత్సవాల ప్రారంభంతో గుణదల కొండ భక్తులతో పోటెత్తింది. మరియతల్లి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మేరీమాతను దర్శించుకున్న భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కరుణించు మేరీమాతా అంటూ ప్రార్థించారు. కొవ్వొత్తులు వెలిగిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ, ఉయ్యాలలు కడుతూ మరియతల్లిని వేడుకుంటున్నారు. తిరునాళ్లలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు యాత్రికులకు నోరూరించే విధంగా ఉన్నాయి. ఏడాదికొక్కసారి మాత్రమే కనిపించే బెల్లపు బూందీ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నల్లని బెల్లపు చెరకులు, పిల్లలు అమితంగా ఇష్టపడే పీసు మిఠాయిలు, అందరూ ఇష్టపడే ఖర్జూరాలు , వేడి వేడి జిలేబీలు ఇలా పలు రకాల రుచులు ఆకట్టుకుంటున్నాయి. వీటిని ఆస్వాదిస్తూ యాత్రికులు సందడి చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటయిన వేదిక పై కళాకారులు చేస్తున్న ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలకు భక్తులు తన్మయం పొందుతున్నారు. సంసోను డెలీల, లాజరు జీవిత సువిశేషాలను వివరిస్తూ చేసిన నృత్య రూపకాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొండపై మరియ తల్లిని దర్శించుకుని వచ్చిన భక్తులను ఆధ్యాత్మికంగా ప్రేరేపించి సేదదీర్చే విధంగా ప్రదర్శనలు సాగుతున్నాయి.



విద్యుద్దీపకాంతులతో గుణదల మేరీమాత గుడి



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు



గురువులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

పుణ్యక్షేత్రంలో నేటి కార్యక్రమాలు

ఉదయం
6 గంటలకు - ఉదయకాల ప్రార్థన
7 గంటలకు - సమిష్టి దివ్యబలి పూజ
10 గంటలకు- పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్థనలు
11 గంటలకు- భక్తి గీతాలు
11:30 లకు - దివ్యబలిపూజ దేవాలయములో

మధ్యాహ్నం
12 గంటలకు- కోలాటం
1 గంటలకు - సాంస్కృతిక కార్యక్రమాలు
2 గంటలకు - కోలాటం
3 గంటలకు - దివ్యబలిపూజ దేవాలయములో

సాయంత్రం
5 గంటలకు - పరిశుద్ధ జపమాల
6 గంటలకు - సమిష్టి దివ్యబలిపూజ

రాత్రి
8:30 గంటలకు- గుణదలమాత సంక్షిప్త చరిత్ర
9 గంటలకు - అమృత వర్షిణి నృత్య రూపకం
10:30 గంటలకు - సౌలు మనోపరివర్తనం ఏక పాత్రాభినయం
11:30 గంటలకు- పూల గంప - బుర్రకథ
ఒంటి గంటకు - లాజరు ధనవంతుడు - నాటకం



మరియమ్మ తల్లి విగ్రహం

11న వాసవీ అమ్మవారి ఆత్మార్పణ పర్వదినం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ వాసవీ ఫౌండేషన్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన వాసవీ అమ్మవారి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణమండపం ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో గడిచిన 24 సంవత్సరాలు వాసవీ అమ్మవారి జయంతి, ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11వ తేదీన పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణమండపం ప్రాంగణంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 102 మంది కన్యలతో కృష్ణానది నుంచి పవిత్ర జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, లలితాసహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రముఖులు కొనిజేటి రమేష్, నూకల నాగేశ్వరరావు, కేవీఎల్ గణేష్, పీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు ఎంపిక



జట్టుతో ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమా పావని, పీఈటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సూపర్ సెవన్ క్రికెట్ యూత్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు గొల్లపూడి అట్కిన్‌సన్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సూపర్ సెవన్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీలలో కర్నూలు జిల్లా మద్దికేరలోని ఒక స్కూల్ ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలకు అండర్–23 బాలుర విభాగంలో అట్కిన్‌సన్ హైస్కూల్లో చదువుకుంటున్న శామ్యూల్ జాయ్, మయూర్ కార్తీక్, పూర్ణ శశాంక్, సాయి ఆకాంక్ష, షమయ, మహవీర్, సోహాయిల్ ఖాన్, సందీప్, విజయ్ పోటీలకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం అట్కిన్‌సన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమా పావని పోటీలకు వెళ్లే విద్యార్థుల జట్టును అభినందించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న క్రీడా శక్తి సామర్థ్యాలను వెలికితీసి పోటీ ప్రపంచంలో ముందంజలో నిలుపుతున్నామని తెలిపారు. విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తూ నాయకత్వ లక్షణాలు అలవరుచుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. క్రీడలు మానసిక వికాసంతోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో అట్కిన్‌సన్ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఎమ్ ఐజాక్, మయూరి, సురేష్ పాల్గొని పోటీలకు వెళుతున్న జట్టుకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. కాగా ఈ పోటీలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని సిమ్లాలో జరుగబోయే 19వ బాలుర యూత్ నేషనల్ సూపర్ సెవన్ క్రికెట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున పాల్గొననున్నారు.

సామాజిక స్పృహ పెంపొందించుకోవాలి



చెత్తను సేకరించిన విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీలతో పాటుగా సమాజాన్ని సైతం అర్థం చేసుకునే దిశగా ముందుకు సాగాలన్నారు. అటువంటి అంశాలకు ఎన్ఎస్ఎస్ చాలా తోడుగా ఉంటుందన్నారు. చదువుతో పాటుగా సమాజంలో అంశాలపై సైతం పట్టు సాధించినప్పుడు మంచి పౌరులుగా ఎదుగుతారని వివరించారు. అనంతరం గొల్లపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. గొల్లపూడిలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు గొల్లపూడి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బీ శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు నవీన్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్ వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి రోడ్, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, ఔట్ ఏజన్సీ, మీరా సాహెబ్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కుటుంబంలోని బంధాలు, బాంధవ్యాల గురించి పిల్లలకు తెలియ చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సత్యచిత్ర అన్నారు. భవానీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన 'ఫ్యామిలీ ఫెస్ట్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దలను ఎలా గౌరవించాలి, కుటుంబంలోని అనుబంధాలు, సమాజంపట్ల బాధ్యతల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రామారావు, కోఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, డీన్ రంగారావు, సీ–బ్యాచ్ ఇన్‌చార్జ్ నాగరాజు, ఉపాధ్యాయుల బృందం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.